**SRINIVASA BALABHARATI - 91**
***(Children Series)***

**TULASI**

*By*

***Sri B.Raghavacharyulu.***

T.T.D.Religious Publications Series No.: 946

© All Rights Reserved

First Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*

Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 91**

# తులసి

రచన
**బి.రాఘవాచార్యులు**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయగలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే ''శ్రీనివాస బాలభారతి'' అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.



కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఒక్క మాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.

తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# తులసి

మన భారతదేశం పుణ్యభూమి. ఇలాంటి పేరు ప్రపంచంలో మరి ఏ దేశానికీ లేదు. అందుకు కారణం గొప్పవారైన మహర్షులు, మహా భక్తులు, పతివ్రతలు జన్మించటమే.

"ఒక జాతి యొక్క జీవనవిధానం ఆ జాతి తమ స్త్రీలకిచ్చే గౌరవాన్ని బట్టి వుంటుంది" అన్నాడొక ఫ్రెంచ్ దేశీయుడు. ప్రపంచ సాహిత్యం యావత్తు పరికించి చూస్తే భారతీయ సాహిత్యంలో కనబడే స్త్రీత్వం ఛాయలు మరెక్కడ కనబడవు." అని చెప్పింది డాక్టరు అనిబిసెంట్.

భారతీయ మహిళ ప్రాచీనుల ఆదర్శం. భారత స్త్రీకి భర్తే దైవం. హిందూస్త్రీలు ఉదయాన్నే లేచి తులసి బృందావనాన్ని దర్శించి పూజ చేసి, తమ పాతివ్రత్యం వెయ్యేళ్ళు చల్లగా ఉండాలని ప్రార్థించటం మనందరికి తెలిసిన విషయమే కదా!



**తులసి! శ్రీసఖి! శుభే! పాపహారిణి! పుణ్యదే ।**
**నమస్తే నారదనుతే! నారాయణ మనఃప్రియే॥**

అని ప్రార్థించే ఆ తులసి జీవిత చరిత్ర తెలుసుకోవటం మనందరికి అవశ్యకర్తవ్యం.

కృతయుగంలో ధర్మధ్వజుడనే భూపతి న్యాయ మార్గంలో రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. తన కాలంలో ఉన్న భూపతులనందరిని జయించి తన విజయ దుందుభిని నలుదిశల వెలయింపజేశాడు. ఆయన భార్య మాధవి. ధర్మధ్వజుడు తన మనోరథం తీరేటట్లు సుగంధ పరిమళాలతో గుబాళించే ఉద్యానవనాన్ని చేరాడు. కోకిలల గానాలను వింటూ మనసులో రత్యభిలాషలు స్థిరమైనప్పుడు సుగంధ పుష్పశయ్యపై అనేక విధాల క్రీడించాడు. సరసునితో చిరకాలం సురతలో కాలం గడిచినపుడు విధివశాత్తు కాంతామణి సద్యః కాలంలో చూలాలై శుభలక్షణమైన గర్భం ధరించింది.



మంచి గ్రహబలంలో, శుభలక్షణమైన కార్తీక పున్నమిరోజున, శుక్రవారం లక్ష్మీఅంశతో పుత్రికారత్నం జన్మించింది. ఆ సమయంలో దుందుభిధ్వానాలు మ్రోగాయి. దేవతలు పూలవర్షాలు కురిపించారు. మంచివాళ్ళు పుట్టే సమయంలో దేవతలు తన సంతోషాన్ని తెలుపలేకుండ వుండలేరు గదా!.

**బాల్యం:**

పూర్ణచంద్రునితో సమానమైన ముఖం, పద్మాల్లాంటి కళ్ళు, పండిన దొండపండులాంటి పెదవి, మెరుపుతో సమానమయిన శరీరకాంతి, ఎఱ్ఱని చిగుళ్ళలాంటి సున్నితమైన పాదాలు, నల్లని జడ, ప్రకాశించే వళిత్రయంతో, తపస్సుకు అనుకూలమైన శరీరంతో ప్రకాశిస్తున్న ఆ బాలిక సాటిలేని సౌందర్యాన్ని ప్రపంచంలోని వారంతా పొగిడారు.

అందమైన ఆ ముద్దుగుమ్మను చూసి ముద్దాడని వాళ్ళు లేరు. ఆ చిన్నారితో పోల్చటానికి అప్సరసస్త్రీలు కూడా సాటిరారని ఆ ప్రాంతంలో ఉన్న మునులు ప్రేమతో ఆమెకు "తులసి" అని నామకరణం చేశారు.

తులసి బాల్యం నుంచే దైవభక్తి కలిగి తల్లిదండ్రులను చాలా భక్తి శ్రద్ధలతో సేవిస్తూండేది. ఆమెకు తపస్సు చేయటం అంటే ఎంతో ఇష్టం. తల్లిదండ్రుల అనుమతిపొంది జనులెవ్వరు ప్రవేశించని, మునిజనుల నివాసంతో పావనమైన బదరీవనానికెళ్ళి తపస్సు చేయటం ప్రారంభించింది. ఆనాటి కాలంలో తపస్సును మించిన గొప్పసాధనం మరొకటి లేదు కదా! తపస్సు కొంతకాలం సాగింది.

### ఒంటికాలిపై తపస్సు:

తులసి గ్రీష్మకాలంలో పంచాగ్ని మధ్యంలో ఉండి, పళ్ళను, నీటిని మాత్రమే భుజిస్తూ తపస్సు చేసింది. వర్ష



ఋతువులో వాన వంగుళ్ళలో కూర్చొని ఆకులను మాత్రమే తింటూ ఉండేది. వడవడవడికించే వడగాడ్పులలో గాలినే ఆహారంగా తీసికొంటూ ఒంటికాలిపై నిల్చొని ఏకధాటిగా తన మనసులోని కోరికతో ఆహారం తీసుకోకుండా నిశ్చలంగా చాలాకాలం రాత్రి పగలు అనకుండ ఘోరతపస్సు చేయసాగింది. ఇలా ఆమె తపస్సు కొంతకాలం సాగింది.

### బ్రహ్మవరాలు :

తులసి తపస్సుకు, మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. ఆ విధంగా తపోదీక్షలోఉన్న తులసిని చూసి వాణీపతి అయిన బ్రహ్మ ఆమెకోరిక తీర్చదలచాడు. తులసి నారాయణుడు తనకు ప్రాణేశ్వరుడై అనుగ్రహించాలని తపస్సు చేసింది. అప్పుడు బ్రహ్మదేవుడు "నీవు ఏ వుద్దేశ్యంతో తపస్సు



చేస్తున్నావో నీ మనసులో ఉన్న కోరికను భయపడకుండ చెప్పు" అన్నాడు. అది విని తులసి "కాంతుని, సుందర విగ్రహం కలవానిని, శాంతుని, నారాయణుని, యశస్సుగల వానిని మనసులో భర్తగా కోరాను. ఆ కోరికను దయచేయి స్వామీ! అని అడిగింది."

అప్పుడు బ్రహ్మదేవుడామెకిలా వరాలు ప్రసాదించాడు "హరివంశంలో ముందు సుధాముడనే గోపకుడు పుట్టాడు. అతడు గోభువనంలో నీ అందాన్ని చూసి మన్మథుని బాణంతో విభిన్న మనస్కుడై ఉండగా రాధికాసతి చూసి మందలించింది. రాధికాశాపంతో మార్తాండ సమాన తేజుడై శంఖచూడునిగా భారతదేశంలో జన్మించాడు. మాధవుని అంశలో రాక్షసవంశజుడై పుట్టాడు. వాడు చతుర్భుజుడు. వానికి సరియైనవాడు ఏడు లోకాల్లో లేడు. ఇప్పుడు అతనికి నీవు దేవేరివవుతావు. తరువాత గోవిందుని వరిస్తావు. ఇది నిజం.



కాని మరొక విషయం ఏమిటంటే నీవు విష్ణువు శాపం చేతనే వృక్షంగా మారుతావు. నీవు లేని పూజ మిక్కిలి నిష్ఫలమైంది. పువ్వులలో ఎంతో శ్రేష్ఠమైన దానివిగా పేరుకెక్కుతావు. అంతేగాక నిన్ను ఆరాధించేవారిని పవిత్రులుగా చేయగలవు. నీవు కూడా అతి పవిత్రత పొందుతావు. మురారి నిన్ను ప్రాణంతో సమానంగా చూస్తాడు. 'బృందావని' అంటూ నిన్ను జనులంతా ఇష్టంతో ఎప్పుడూ మ్రొక్కుతారు. గోపకులు నీపత్రాలతో గోపాలక దేవపూజ చేస్తారు. నీవు త్రిలోకపావనివై ప్రకాశిస్తావు. విష్ణువు వద్ద వృక్షపుదేవి ఆకృతితో ప్రకాశిస్తావు. నా వరంతో నీకు ఇవన్నీ కలుగుతాయి."

అది విని తులసి సంతోషంతో ముఖంలో చిఱునవ్వు చిందేటట్లుగా హంసవాహనుడైన బ్రహ్మకు మ్రొక్కి "బ్రహ్మదేవా! మనసులో వున్న అనుమానం తెలుపకుండ

వుండటం మంచిదికాదని చెబుతున్నాను. రెండు భుజాలు కలవానిపై వున్న స్నేహంలాగా చతుర్భుజునిపై కలుగదు. అంతా శాపప్రభావం కదా! నాలుగు భుజాలు కలిగిన ఆ శంఖచూడునే వరిస్తాను. విష్ణువు ఆజ్ఞ ధిక్కరించటం ఎవరితరం కాదు గదా! రుక్మిణీలోలుని పెళ్లాడటానికి అనుగ్రహించు." అని వేడుకొంది.

## నీవు రాధసమానమౌతావు :

అప్పుడు బ్రహ్మదేవుడు "వత్సా! షోడశాక్షరాలతో ప్రకాశించే రాధామంత్రం పఠించు. అనుమానం వద్దు. నీ కోరికను అనుగ్రహించాను. రాధకు, నీకు గల అసాధారణమైన స్నేహంతో జలజాక్షుడైన విష్ణువుకు నీవు రాధ సమాన మవుతావు. మీ రహస్యాలు రాధకు తెలియవు" అని చెప్పి రాధా మంత్రాన్నుపదేశించి కవచ క్రమం, స్తోత్రం, పూజాది విధానం తెలిపి వెళ్ళాడు.



తులసి తనకు బ్రహ్మయిచ్చిన వరం విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వారు చాలా సంతోషించారు. తులసి మనస్సులో వివాహానికి సంబంధించిన కోరికలు పుడు తున్నాయి. యవ్వనానికి అది సహజమే కదా! తులసి బ్రహ్మ చెప్పిన రాధామంత్రాన్ని ఉపాసించి మిక్కిలి సిద్ధురాలయ్యిందా అన్నట్లుగా విష్ణువు మహిమ ప్రవహించింది.

మూడు లోకాలకు మించిన భోగభాగ్యాలతో ప్రకాశించి, ఘోరమైన జపం చేసింది. యౌవనవతి అయిన ఆమె రాజర్షియింట భోజనం భుజించి, మలయమారుతం వీచగా పూలపాన్పుపై సుఖంగా నిద్రించింది. నిదురించిన ఆ మదిరాక్షిని చూసి పూలబాణుడైన మన్మథుడు ఇదే తగిన సమయమని పదునైన తన పూలబాణాలను ఆమెపై వేశాడు. శంఖచూడుని పెళ్ళిచేసుకోవాలనే కోరిక ఆమెకు ముందే కల్గివుండటం చేత అతడే కలలో కనిపించాడు. అతడు



అందగాడు. దేవతల శత్రువు. కలలో చూసినంతనే ఆమెకతనిపై మోహం కలిగింది. అతడు స్వప్నంలో చెప్పలేని మన్మథలీలలతో ఆమెను ఆనందింపచేశాడు.

తులసి నిద్రనుంచి మేల్కొని ప్రాణేశ్వరుని చూడక కొంత విచారం, సంతోషం పొందింది. తరువాత ఎక్కువగా విషాదం పొందింది. "ఆహా" అని మెచ్చుకొంటుంది. ఇంతలో ఎంతకాలం జరిగిపోయిందని అనుకొంటుంది. ఆమె మన్మథబాధ భరించలేక ప్రాణనాథుడు ఎప్పుడు వస్తాడని గుక్కపెట్టి కొంతసేపు ఏడుస్తుంది. అంతలో భర్త కనిపించాడని ప్రేమతో చూస్తుంది. ఆ తర్వాత తనను కౌగలించాడని కొంతసేపు చాలా సంతోషం పొందుతుంది. కలలో కనిపించిన శంఖచూడుని నిందిస్తుంది.

## శంఖచూడునిరాక:

ఆ విధంగా మన్మథతాపం పొందే ఆ చంచలాక్షిని ఆమె అంతఃపుర చెలికత్తెలు కొంత పరితాపం తీర్చి ఆ



శంఖచూడుడు వచ్చాడని చెప్పివెళ్ళారు. శంఖచూడుడు యోగంచేత జైగీషమునివల్ల కృష్ణమంత్రాన్ని పొంది పుష్కర ప్రాంతానికి వచ్చాడు. బ్రహ్మ దయతో ఇచ్చిన వరంతో సంతోషంతో బదరికావనానికి వచ్చాడు. అంతలో అతడు తులసి తపస్సు చేస్తున్న ప్రాంతానికి వచ్చాడు.

సుందరమైన శరీరం గలవాడు, శోభించే రత్నాలను ధరించినవాడు, రసికుడు, మనోహరాకారుడు అయిన శంఖచూడుడు ఆనందంతో మోహం వుట్టిపడేటట్లు ఆ లలనా రత్నాన్ని చూశాడు. చూస్తే ఆమె ముఖంలో ఎక్కువ సిగ్గు ప్రవేశించింది. తులసి అందాన్ని శంఖచూడుడు అనేక విధాల మనసులో కొనియాడి ఆమెతో ఇలా సంభాషించాడు–

" నీవు ఎక్కడ నివసిస్తున్నావు? నీ తల్లిదండ్రులెవరు? నీవొక్కదానవే ఒంటరిగా ఎందుకు నిలిచావు? నిలిచినందుకు

ఏం ప్రయోజనం? నీ ప్రక్క సంచరించే చెలికత్తెలు ఎవరూ లేరు గదా! కారణమేమయి వుంటుంది? అంతా దాపరికం లేకుండ చెప్పు" – అని అడుగగా తులసి అతనితో ఇలా అన్నది–

"ధర్మధ్వజుడనే రాజు నాతండ్రి. నారాయణుని భర్తగా తలచి తపస్సు చేస్తున్నాను. నీవు రాజువని మోమాటం లేక ఇంతవరకు మాట్లాడాను. పురుషులతో స్రీలు ఏకాంతంగా ఏ మాటలు మాట్లాడరు గదా! మంచి కులంలో పుట్టిన స్త్రీ రత్నం రాజును చూస్తుందా?

అంతేగాక స్త్రీజనం నిందించదగినవారు. ప్రాజ్ఞుడైన వాడు (ఉచితము, అనుచితము తెలిసినవాడు) స్త్రీ జనులకు లొంగిపోడు. మంచిప్రాయం, సౌందర్యం, సంపద, రసికత కలిగిన భర్తను ప్రాణంతో సమానంగా చూస్తారు. యవ్వనంలో



వున్న స్త్రీలు ఇతడు చక్కనివాడు అని తోచినట్లయితే ఏ విధంగానయినా సరే ప్రేమించటానికి ప్రయత్నిస్తారు. ఇతరులు ఏమంటారో అనేది కూడా లెక్కచేయరు."

## స్త్రీలు మంగళప్రదాతలు:

అది విని శంఖచూడుడు "నీవు చెప్పిన మాటలు నిజం. జనులందరికి మోహం కలిగేటట్లు శతానందుడయిన బ్రహ్మ స్త్రీజనులను మంచిచెడ్డలను పోల్చి రెండు రకాలుగా సృష్టి చేశాడు. సృష్టి ఆదిలో రాధ, సావిత్రి, లక్ష్మి, సరస్వతి, దుర్గ మొదలైన సతీరత్నాలు విధాతచేత నిర్మించబడ్డారు. వారు ఈ భూమిమీద మంగళప్రదాతలుగా పేరుకెక్కారు.

అంతేగాక పండితుడు, ఉత్తముడు పరస్త్రీని కోరుతాడా? కోరదు. ఓ అమ్మాయీ! నేను ఆ బ్రహ్మ ఆజ్ఞచేతనే



వచ్చాను. నేను శంఖచూడుడనే రాక్షసరాజును. చాలా సంతోషంతో నిన్ను పెండ్లాడాలని కోరినవాణ్ణి. పూర్వజన్మలో విష్ణువును. గోపికలచేత సుధాముడుగా పిలువబడి గోపకులంలో పుట్టాను. రాధ శాపంచేత ఈ విధంగా జన్మించాను. పూర్వం నీవు ఆ కృష్ణునితో కలియటం చూసి రాధ కోపించి 'భూమి మీద పుడతావు'. అని శపించింది. అపుడే నీపై మిక్కిలిప్రేమ కలిగినవాడనైనా రాధికయొక్క భయంచేత నిన్ను కలవలేకపోయాను. ఇపుడిదంతా కృష్ణమంత్ర ప్రభావం. ఈ విషయం నీకు తెలుసు". అన్నాడు.

అప్పుడు తులసి చిన్నగా నవ్వి దానవేంద్రుడైన శంఖ చూడునితో "కామంచేత మూర్తీభవించి కూడా ఆ విధమైన తెలివిగలవాడు స్త్రీని జయిస్తాడా? అట్లైయితే అలాంటివానిని చాలా పవిత్రుడని కొనియాడతారు.



## ఆడబిడ్డను అమ్మేవాడు పాపి:

ఓ పవిత్రమయిన మనస్సు గలవాడా! ఈ భూమి మీద పుట్టి గిట్టినపుడు బ్రాహ్మణుడు పదవరోజున, రాజు పన్నెండవరోజున పవిత్రులవుతారు. స్త్రీ చేత జయింపబడిన వాడు, అపవిత్రుడు చితిలో దహనం చేసినపుడు పవిత్రుడవుతాడని పెద్దలు చెబుతారు. స్త్రీచేత జయింపబడిన మనస్సుతో పెట్టినవాని పిండాన్ని వాని పితరులు ఇష్టపడరు. దేవతలు అలాంటి పూజలు స్వీకరించరు. అలాంటివానికి జపం, తపం, జ్ఞానం, మంచికీర్తి ఉన్నా ప్రయోజనం లేదు. హీనుడైన వానికి, అంగలోపం కలవానికి, ముసలివానికి, కామంచేత నిండిన దేహం కలవానికి, అజ్ఞానం కలవానికి, దరిద్రునికి, నపుంసకునికి, అంధునికి, కోపిష్ఠికి, దీనుడైనవానికి కన్యనిచ్చిన తండ్రి అవమానాల పాలవుతాడు. శాంతస్వభావునికి, గుణవంతునికి, సాటిలేని రూపం కలవానికి, ధీమంతునకు, కుమార్తెనిచ్చిన తండ్రి సంతోషంతో పది యజ్ఞాల ఫలాన్ని అనుభవిస్తాడు.

ఎవరైతే కుమార్తెను అమ్ముకొని ధనం సంపాదిస్తాడో వాడు ఎల్లకాలం యమకింకరులతో హాహాకారాలను పొందుతూ భయంకరమైన పాపనరకంలో బాధను పొందు తాడు. అంతేగాక తిరిగి వాడు మరుజన్మలో దుష్టుల చేత పీడింపబడుతూ మాంసం అమ్ముకొని జీవిస్తాడు" అన్నది.

## మరుజన్మలో హరియే భర్త:

ఈ విధంగా తులసి, శంఖచూడులు వాదించుకొనే సమయంలో దేవతల పెద్ద అయిన బ్రహ్మ వచ్చి వాళ్ళను చూశాడు. తర్వాత శంఖచూడునితో "ఓ రాక్షసరాజా! మీరెందుకు వాదిస్తున్నారు. గాంధర్వ పద్ధతిలో ఈ స్త్రీని వివాహం చేసుకో. మీ యిద్దరికి మేలైన దాంపత్యం కల్గుతుంది. ఆమె సతీజనరత్నం, నీవు పురుషశ్లాఘ్యుడవు. హఠాత్తుగ వచ్చిన ఫలాన్ని విడిస్తే సుఖం మళ్ళా వస్తుందా?" అని చెప్పి తులసిని "ఓ బాలామణీ! ఎందుకు పరీక్షిస్తున్నావు. ఇలాంటి మంచివానిని భర్తగా ఏ లోకంలోను నీవు చూడలేవు. ఆలస్యం



చేయకుండా ఇతనిని భర్తగా వరించు. గణపతి –పుష్టి, అహల్య గౌతముడు, ధారుణి– వరాహమూర్తి, అరుంధతి – నా కుమారుడు వశిష్ఠుడులాగా మీకు లోకంలో మంచిపేరు వస్తుంది. తర్వాత జన్మలో నీకు హరియే భర్త కాగలడు. నా మాటలు వృథా గావు" అని దీవించి వెళ్ళాడు.

## గాంధర్వవివాహం:

అందాలరాశియైన తులసిని గాంధర్వ పద్ధతిలో వివాహం చేసుకోవటానికి దానవ చక్రవర్తికి మనసులో చాలా కోరిక కల్గింది. ఆ సమయంలో దేవతలు పూల వర్షం కురిపించారు. గంధర్వుల గుంపు నాట్యం చేసింది. దుందుభుల మోత మ్రోగింది. అంతలోనే శంఖచూడుడు తులసిచేయిపట్టి ఆ ప్రాంతంలోగల సరస్సులు, కన్నులపండుగచేసే ఉద్యానవనాలు మొదలైన విశేషాలను చూపించాడు. ఈ విధంగా తులసితో సుఖంగా కొంతకాలం గడిపి తన నివాసం చేరుకొన్నాడు.



## శంఖచూడుని అమానుషాలు:

శంఖచూడుడు సాటిలేని పరాక్రమాన్ని ప్రదర్శించి దేవతలందరిని పారద్రోలాడు. ఆ తర్వాత మునులు చేస్తున్న యజ్ఞాలను పాడుచేసి యజ్ఞఫలాన్ని హరించాడు. ముని శ్రేష్ఠులను వారు తపస్సు చేసుకొనే ప్రాంతాలనుంచి దూరంగా తరిమివేశాడు. పాపస్వభావంగల శంఖచూడుడు ఇతరులను బాధించటానికి వెనుకాడేవాడు కాడు. గర్వాతిరేకంతో దేవతలతో యుద్ధంచేసి దేవతాస్త్రీలను బంధించి తెచ్చాడు. వారి బంధువులు దుఃఖించేటట్లు చెఱసాలలో ఉంచి కష్టపెట్టాడు. ప్రపంచమంతటిని తల్లడిల్లచేశాడు. దేవతల నగరమైన అమరావతిని స్వాధీనం చేసుకొన్నాడు. మరల రెండవసారి శంఖచూడుడు కైలాసంపై దండెత్తాడు. వానితో పోరాడడానికి కాళి వచ్చింది. కాని ఆమె కూడా ఓడిపోయింది. దానితో దేవతలు కుమారస్వామిని తీసికొని వచ్చారు. శంఖచూడుడు అతనిని తన బాణాలచేత మూర్ఛితునిచేసి



తన నగరం చేరుకొన్నాడు. మనసులో కొంచెం కూడ భయంలేక తన ప్రతాపం దిక్కుల చాటేటట్లు ముల్లోకాలను బాధిస్తుండేవాడు.

ఒకనాడు శంఖచూడుడు నిండుకొలువులో ఉన్నాడు. ఆ సమయంలో రాక్షస గురువైన శుక్రాచార్యుడు అక్కడికి వచ్చాడు. ఆయన శంఖచూడునితో "పార్వతి స్త్రీ రత్నం. శివునకు పార్వతి ఎందుకు? నీవు ఆమెను తీసుకొని రాగలవా?" అన్నాడు. వెంటనే శివునకు పార్వతిని పంపమని కబురంపాడు. గర్వాతిరేకంలో వున్నవారు ఇది ఉచితం, ఇది అనుచితం అని ఆలోచించరు గదా! శంఖచూడుని వర్తమానం విన్న శివుడు కోపించి అతనిని సంహరించాలని అనుకొన్నాడు.

## దేవతలు బ్రహ్మతో మొరపెట్టుకొనటం:

శంఖచూడుని అమానుషాలు భరించలేక దేవతలు బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మను దర్శించారు. వినయంతో బ్రహ్మకు నమస్కరించారు. తర్వాత భక్తి భావంతోను, అతి

దుఃఖంతోను శంఖచూడుడు తమను బాధించిన విధం, యజ్ఞాలను పాడుచేసిన విషయం, ఇంద్రుని జయించటం మొదలైన విషయాలు చెప్పారు. అతని బాధలను భరించలేకనే తాము ఇక్కడికి వచ్చామని, దయతో తమ్ము రక్షించాలని. వేడుకొన్నారు. మీరు రక్షించకపోతే దిక్కెవరు? ఎలాగయినా మమ్ముల్ని రక్షించమని ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ చిరునగవుతో ఇలా చెప్పాడు–

"శంఖచూడుడు బుధవర్గానికి బాధకల్గించే విషయం నాకు తెలుసు. కాని ఆ రాక్షసుని చంపటానికి వీలుకాదు. ఎందుకంటే వాడనేకవిధాల మాయలను తెలిసినవాడు. ఇంకను యుద్ధంలో అనేక విధాల పరాక్రమాన్ని ప్రదర్శించే వాడు. మీరు భయపడకండి. ధైర్యంతో ఉండండి. అతణ్ణి వధించటానికి త్రిపురాంతకుడైన శివుడే తగినవాడు. అతనిని



చూస్తే మీ కష్టాలన్నీ తొలగిపోతాయి. మీరు వెళ్ళండి. నేను ఇపుడే వస్తాను" అన్నాడు.

అప్పుడు బ్రహ్మ మునులు తపస్సు చేస్తున్న గిరీంద్రాన్ని చూశాడు. ప్రకాశించే వెలుగులో గౌరితో వున్నట్టి విశ్వారాధ్యుడయిన శివుని చూశాడు. బ్రహ్మ దేవతలతో పాటుగా ఆయనకు నమస్కరించి దేవతల కష్టాలన్నీ విన్నవించాడు. అంతట శివుడు 'ఓ దేవతలారా! ఆ రాక్షసుడైన శంఖచూడుని దండించలేను. మనమందరం కలసి నారాయణుని దర్శించటానికి వెడదాం' అన్నాడు. దేవత లందరు కలిస్తేగాని వాణ్ణి చంపలేరు. అలాంటి బలసంపన్నుదు వాడు.

ఈశ్వరుడు, దేవతలు అందరు సంతోషంతో హరిపట్టణ ద్వారం చేరారు. అక్కడవున్న ధీరులను, మనోజ్ఞ ఆకారులను, శౌరీప్రతిహారులను చూసి తమరాకకు కారణం



తెలిపారు. రత్నమణులతో ప్రకాశించే భవనంలో పాద సేవ చేస్తున్న లక్ష్మితో విష్ణువును దేవతల సమూహం చూసింది.

శివుడు, బ్రహ్మాది, దేవతలు, వారి రత్నకిరీట కాంతులను విష్ణుపాదాలకు కానుకలుగా ఇచ్చారు. శరీరం పులకలు క్రమ్మగా కన్నుల నీళ్ళు నింపి గద్గదకంఠంతో కాంతి తగ్గిన ముఖాలతో నిలిచి ఉన్నారు. చెప్పటానికి మాటలురాక నిలబడి ఉన్న దేవతలను చూసి బ్రహ్మ వినయంతో చేతులు జోడించి విష్ణువుతో ఇలా అన్నాడు– "పాపం అనే అరణ్యానికి గొడ్డలిలాంటివాడా! నీ దయామృతాన్ని ఆ శంఖచూడుడు నిస్సారం చేశాడు. గర్వంచేత నీ భక్తులను హింసించాడు. నీ మధురమైన మాటలు విన్నంతనే మాకు సుఖం కల్గుతుంది. అలా స్తుతించి ఆ రాక్షసుడైన శంఖచూడుని వలన పొందిన దీనావస్థను తెలియజేశారు. వారి మాటలు విన్న సర్వజ్ఞుడైన హరి దేవతలకు ఇలా చెప్పాడు–



**అతనికి మరణమాసన్నమైంది:**

"బాహుపరాక్రమశాలి అయిన శంఖచూడుడు చేసే క్రూరకార్యాలు నాకు తెలుసు. అయినా వానిని చంపలేకుండా వుండటానికి కారణం నా భక్తుడవటమే. ఆ రాక్షస చక్రవర్తి యైన శంఖచూడుడు జయించటానికి వీలుకానివాడు. అలాంటివాణ్ణి మన్మథహంతకుడైన శివుడు నా శూలంతో చంపుతాడు. మీరు దుఃఖపడకండి. మీకు మేలు జరుగు తుంది" అని వాళ్ళను ఓదార్చి శూలాన్ని శివునికిచ్చాడు. "ఓ దేవతలారా! మీరు త్వరగా వెళ్ళండి. నేను బ్రాహ్మణవేషం ధరించి శంఖచూడుని దగ్గరకుపోయి పూర్వం నేను ఇచ్చిన కవచాన్ని తెస్తాను. అతడు మన చేతిలో చంపబడతాడు. అంతేగాక ఎప్పుడైతే వాని భార్య సతీత్వానికి భంగం కలుగుతుందో అప్పుడే వాడి మరణం సంభవమవుతుంది. కాబట్టి నా తేజం ఆమె గర్భంలో నిక్షేపించాలి' అన్నాడు. ఆ

మాటలకు ఈశ్వరుడు సంతోషించి త్రిశూలం తీసికొని బ్రహ్మాది దేవసంఘంతో దైత్యుడైన శంఖచూడుని నాశనం చేసే ప్రయత్నానికి వెళ్ళాడు.

**శివుని సందేశం:**

రాక్షసుని చంపటానికి ప్రమథప్రభువైన శివుని నియమించి బ్రహ్మ తన స్థానాన్ని చేరుకొన్నాడు. దేవతలు తమ నివాసానికి వెళ్ళారు. పుష్పభద్రానది ఒడ్డునగల వటవృక్షం క్రిందకు శివుడు చేరుకొన్నాడు. అక్కడినుంచి దానవనాథుడైన శంఖచూడుని దగ్గరకు దూతను పంపాడు. పది యోజనాల వైశాల్యం గల, గొప్ప దుర్గాలు గల, ద్వాదశ ద్వారాలతో విలసిల్లేటటువంటి, మాణిక్యాలచేత పొదగబడిన నగరంలో ద్వారపాలకుని ఆజ్ఞతో దూత ప్రవేశించాడు. వీరుల సమూహం సేవిస్తుండగా, రత్నాలతో పొదగబడిన కాంచనరత్న పీఠంపై ఉన్న శంఖచూడుని దగ్గరికిపోయి ఇలా చెప్పాడు–



'ఓ దానవనాయకా! నేను ఈశ్వరుని ఆజ్ఞ మేరకు వచ్చాను. నన్ను తప్పుగా భావించకుండా శ్రద్ధగా నామాట విను. హరి ఈశ్వరునకు శూలాన్నిస్తే పుష్పభద్ర దగ్గరికి వచ్చివున్నాడు. దేవతల రాజ్యాన్నిచ్చి నీవు హాయిగా ఉండు. అలా కాకపోతే యుద్ధభూమిలో నీ శరీరాన్ని తునాతునకలు చేస్తాడు.' అని చెప్పాడు. శంఖుచూడుడు మహేశ్వరుని దగ్గరికి వెడతానని దూతకు సమాధానాన్నిచ్చి పంపాడు. ఈశ్వరుడున్న పుష్పభద్ర దగ్గరికి సేనాని వీరభద్రుడు, విశాలాక్షుడు మొదలైన వీరులు, ఎఱ్ఱని వస్త్రాలు ధరించి భీకరరూపంతో కాళిక వచ్చింది. అంతేకాకుండ శస్త్రాస్త్రసమూహాలు మహాదేవుని దగ్గరకు వచ్చి నిల్చాయి.

**పరమశివునితో యుద్ధమా!**

శంఖచూడుడు సంతోషంతో అంతఃపురంలో ప్రవేశించి దూతతెచ్చిన విషయమంతా తన ప్రియకాంత



అయిన తులసికి ఉత్సాహంతో చెప్పాడు. తులసి యుద్ధ ప్రయత్నం విని కన్నీళ్ళు నిండి, కంఠం ఎండిపోగా భర్తను కౌగిలించి అతివినయంతో ఇలా అన్నది. ''ప్రాణేశా! ఈశ్వరునితో యుద్ధం మంచిదా? అతడు లోకాన్నే సంహరించ గలడు. బాణుడు మొదలుగా గల మీవారు భక్తితో సేవించి నశించక ముల్లోక సామ్రాజ్యాన్ని పొందారు కదా! నీవు అలాగే ప్రవర్తిస్తే మంచిది గదా! అంతేగాక ఈశ్వరుడు దేవతల శత్రువులైన త్రిపురాసురుడు మొదలుగా గలవారిని వధించినవాడు. రాక్షససమూహాల గర్వమణచినవాడు. అలాంటివానిని నీవు యుద్ధభూమిలో జయించుట మాటలా!

**కాల కర్మగతి తప్పదు:**

ప్రేయసి మాటలువిన్న శంఖచూడుడు నవ్వి ఆమెను ముద్దాడి 'కాలకర్మగతిని ఎవరు తప్పించుకోగలరు? వివేకం



లేనిదానిలాగా ఎందుకు చింతిస్తావు' అన్నాడు. భూమిమీదగల చెట్లన్నీ పూలను, పండ్లను కొంతవరకు ప్రసాదించి కాలం చెల్లితే గాలితోగాని, అగ్నితోగాని నశిస్తాయిగదా! జనాలచేత జనసంతతిని ఇచ్చేవాడు, జనులను జనులచే నాశనం చేసేవానిని నీవు మదిలో తలుస్తూఉండు. సర్వప్రపంచాన్ని నడిపించే వానిని, ఆద్యంతరహితుని, సృష్టి, స్థితి, లయకారుని నీవు మనసులో తలంచు. పాలదిండిని నేనెక్కడ? నిలాపతి కుమారివైన నీవెక్కడ? మన కలయిక తలిస్తే జలకాష్ఠరీతిగదా! పూర్వం గోలోకంలో విష్ణువుతో ఉండి రాధికాశాపంతో ఇద్దరం ఇంతవరకు ఉన్నాము. ఇక దుఃఖమెందుకు? బృందావనం వెడదాం. అలా అనేక విధాల బోధించినా తులసి తెలుసుకోలేక ప్రియుని వక్షస్థలంపై పెద్దపెట్టున దుఃఖించగా అతడు కృష్ణ మంత్రం చెప్పాడు.

సమస్త దుఃఖాన్ని పోగొట్టేటటువంటి కృష్ణమంత్రాన్ని అతడు తులసికి తెలిపినంతనే దివ్యమైన విజ్ఞాన బుద్ధిచేత

ధైర్యంతెచ్చుకొని సంతోషంతో కాలం గడిపింది. ఆ సమయంలో తన ప్రియసఖిని కౌగలించి మెత్తని పూల శయ్యపై అనురాగంతో సుఖించి ఆమె చీరచెఱగుతో వీస్తే హాయిగా నిద్రించాడు. ఉదయాన్నే విష్ణువును తలుస్తూ లేచి స్నానమాచరించి, పట్టు వస్త్రాలు ధరించి బ్రాహ్మణులకు గొప్ప దానం చేశాడు.

గజరత్నాలను, అశ్వరత్నాలను బ్రాహ్మణులకు, దరిద్రులకు ఇచ్చి, ప్రజలను రక్షించటానికి కుమారుని రాజుగా చేసి, భార్యను అక్కడే వుంచి విజయోత్సాహంతో మదించిన ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో రాక్షస నాయకులతో నగరంనుంచి బయలుదేరాడు. ఆ విధంగా వెడలి పశ్చిమ సముద్ర ప్రాంతంలోని భద్రవటీ తీరాన ఉన్న వటవృక్ష సమీపానికి వెళ్ళి సహస్ర దివ్యతేజశ్శాలియైన శివునికి నమస్కరించాడు.



## దాయాదిద్రోహం పాపం కదా!

అప్పుడు శివుడు శంఖచూడునితో " ఓ రాక్షసరాజా, సృష్టికారణుడైన పద్మనాభుని నాభిపద్మంలో విధాత జన్మించాడు. అతనికి మరీచి పుట్టాడు. అతనికి వైష్ణవుడు, అతనికి కశ్యపుడు అతనికి ధర్మిష్ఠుడు జన్మించారు. అతనికి దంభుడు జన్మించారు. వారు విష్ణుసేవాపరాయణులై చాలాకాలం రాజ్యసుఖాలను భవించి తర్వాత వైకుంఠానికి వెళ్ళారు. పూర్వం నీవు ఆ దంభుని పుత్రుడవై సుధాముడనే పేరుతో అతిధార్మికునిగా ఉండి రాధికాశాపంతో ఇపుడు రాక్షసనాథుడవయ్యావు. భగవంతుని సేవాపరాయణులైన వారు సమస్తాన్ని తుచ్ఛంగా భావించి ముక్తి చతుష్టయాలను చులకనగా చూశారు. అంతేగాక హరిభక్తుడైన ఇంద్రుడు నీకు దాయాది. అలాంటివాని రాజ్యాన్ని హరించవచ్చా? స్వరాజ్యంలోనే సుఖం పొందటం మంచిది కదా! దాయాదికి ద్రోహం చేయటం



పాపం కదా! కావున అమరావతిని దేవతలకిచ్చి ఈ రాజ్యంలో సంపదలతో పాలన చేయటం మేలు కదా! ఉన్న సంపద పోతుందని సంశయం ఉంది. కాలప్రభావంతో సంపదలు వస్తాయి పోతాయి. హరి హర హిరణ్యగర్భులకైనా కాలమార్గం దాటటం శక్యం గాదు కదా! కాలవశాననే కదా! చంద్రుడు కళావంతుడు అవుతాడు, కృశించిపోతాడు. సమరీతిగా ఎవ్వడూ వుండడు. ఆ పరమాత్ముడే సమరీతిగా ఉంటాడు. నేను ఆ పరమాత్మను పారాయణం చేయటం చేత ప్రాకృతయుగాలను చూడగలను. అతని ఆజ్ఞప్రకారం బ్రహ్మ విష్ణువులు సృష్టిస్థితులు చేస్తుంటే నేను సంహారకారణుడై ఉంటాను". అన్నాడు

## ఈ నీతులు ముందేమైనై?

ఆ మాటలువిని శంఖచూడుడు శివునితో "ఓ మహానుభావా! మీరు చెప్పిన మాటలు నిజం. అయినా



ఇంచుక యథార్థం చెబుతాను, ఆదరంతో వినండి. జ్ఞాతిద్రోహం పాపమన్నారుకదా! మరి మీ దేవగుణం బలిని రాజ్యభ్రష్టుని చేసి పాతాళానికి ద్రొక్కారు కదా! రాక్షసులను మోసం చేసి సముద్రంనుంచి పుట్టిన అమృతం త్రాగలేదా! ఇప్పుడు చెప్పే నీతులు ముందు కలలోనైనా చూశారా! పూర్వం దేవతలచే పీడింపబడినవారమైనా కాలక్రమాన ఇపుడు మేము బలవంతులమయ్యాం. సురలకు మాకు సహజ శత్రుత్వంచేత కారణం లేకనే యుద్ధాలు జరుగుతుంటాయి. జయాప జయాలు మేమే అనుభవిస్తూంటాం. శత్రుమిత్ర సమభావులు మీరురావటం మాకు అరుదు. మీ వల్ల జయం కల్గినా, అపజయం కల్గినా ఒక్కటే. కీర్తే ప్రధానం కదా!" అన్నాడు.

## దేవతలతో శంఖచూడుని యుద్ధం:

అప్పుడు శివుడు "ఓ రాక్షసనాథా! పూర్వం హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు విష్ణువుచేతిలో నాశనం పొందటం నీకు

తెలుసుగదా! నీవు అలా యుద్ధంలో మరణిస్తావెందుకు? దేవతల రాజ్యాన్నిస్తే నిన్ను రక్షిస్తాను. నా మాటలు విని సుఖం పొందు. అలా కాకపోతే హరియాజ్ఞతో యుద్ధానికి వస్తాను!" అన్నాడు.

వెంటనే దానవ చక్రవర్తి యుద్ధోత్సాహంతో దేవతల సమూహంపై దండెత్తాడు. దేవతల పక్షంలోని ప్రముఖులు, దానవపక్షంలోని ప్రముఖులతో యుద్ధం చేస్తుంటే వాళ్ళ అరుపులు భూమ్యాకాశాలు నిండాయి. దేవతలు దానవుల ప్రతాపానికి తాళలేక యుద్ధభూమి విడచి వెడుతున్నారు. ఆ సమయంలో కుమారస్వామి రాక్షసులను యుద్ధంలో భయపెట్టాడు. కాళి కూడా భయంకర ఆకారం ధరించి మదించిన ఏనుగులను, వీరయోధులను చంపి రక్తం త్రాగుతూ ఉంది. ఆ భయంకర యుద్ధంలో రాక్షసులు అటు యిటు వెళ్ళలేక భయపడు తున్నారు.



ఆ సమయంలో రాక్షసరాజైన శంఖచూడుడు వచ్చి షణ్ముఖుని ఎదుర్కొని తన శక్తితో భయపెట్టాడు. అప్పుడు కుమారస్వామి గొప్పదైన శక్తితో ఆ రాక్షసరాజును మూర్ఛితుని చేశాడు. అతడు వెంటనే లేచి మరియొక విమానాన్నెక్కి మఱొక విల్లు ధరించి బాణాల వర్షం కురిపించగా దేవతలు భయపడ్డారు. భయంకరమైన శక్తి ఆయుధాన్ని శంఖచూడుడు కుమారస్వామిపై వేయగా అది కడుపుభాగంలో తాకడంతో మూర్ఛపోయాడు. మూర్ఛపడ్డ కుమారస్వామిని చూసి కాళి శోకంతో శివుని దగ్గరికి వెళ్ళింది. పడిపోయిన కుమారుని శివుడు జ్ఞానంతో జీవితునిచేసి అధికమైన బలాన్నిచ్చాడు. దానితో కార్తికేయుడు అత్యంత బలం కలవాడై నందీశ్వరాదులతో సింహనాదాలు చేయగా రాక్షసులు భయపడి శంఖచూడుని దగ్గరికి వెళ్ళారు.

అతడు అజేయుడు శంఖచూడుడు. కాళి వేసే భయంకరమైన బాణాలకు సమానమయిన బాణాలు



ప్రయోగించి వ్యర్థం చేశాడు. శంఖచూడునిపై ఎన్ని మారణ అస్త్రాలు ప్రయోగించినా వమ్ముచేయటంచేత అశరీరవాణి కాళితో ఇట్లన్నది. 'పాశుపతాస్త్రంతో మరణం వాడి దగ్గరికి వెళ్ళదు. అతని భార్య గుణాలరాశి. ఆమె పాతివ్రత్యాన్ని చెడిపితే అతడు చనిపోతాడు. హరిమంత్రకవచం, ఆమె సతీత్వం స్థిరంగా ఉన్నంతకాలం హరి హరులు జయించలేరు. జరామరణ రోగాలకు అతడు అతీతుడు'.

అంత కుమారస్వామి ప్రళయాగ్ని సమానమైన శూలాన్ని విడువగా శంఖచూడుడు దానిని ఎడమచేతితో పట్టుకొన్నాడు. కోపంతో పిడికిలిదెబ్బ వేయగా మూర్ఛపోయి మరల రోషంతో దేవతల సమూహాన్ని చంపి భయంకరమైన ఆకారంతో నిలిచాడు. వానిని చంపలేక కుమారస్వామి శంకరుని దగ్గరికి వెళ్ళి శంఖచూడుని చంపటం అసాధ్యమని చెప్పాడు. ఈశ్వరుడు నిజం తెలిసికొని మిక్కిలి రోషంతో భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు యుద్ధ భూమికి చేరగా



శంఖచూడుడు శివునికి నమస్కరించాడు. ఇద్దరు ఆశ్చర్యంగా చాలాకాలం యుద్ధం చేశారు.

### నా ప్రాణాలు కాపాడు!

ఆ సమయంలో విష్ణువు బ్రాహ్మణుని వేషం ధరించి వడవడ వణుకుతూ కాళ్ళు తడబడతుండగా, చేతిలో కర్రను ధరించి సందడిచేస్తూ శంఖచూడుని దగ్గరికి వచ్చాడు. అతనితో 'రక్షించండి మహాప్రభూ! మంచికులంలో పుట్టినవాణ్ణి, బుధుడను. పాత్రప్రియా! చలిచే అలసిపోయాను. నిన్ను చూసి ఆశతో ఇక్కడికి వచ్చాను. ఎక్కడకు పోలేను. అల్పమైన ఈ శరీరబాధను పోగొట్టి ప్రాణదాతవై వెలుగొందు. శరీరం గడగడ వణకుతూ, బాధపెడుతున్నది. నరాలు గుయిమంటున్నాయి. ముసలివారి కష్టాలు ఏమని చెప్పను? అధికమైన గుణసంపద గలవాడవని నిన్ను నేను అడుగు తున్నాను. లేదని చెప్పే హీనుని దగ్గరికి పోయి యాచించనా? నీవు ఇచ్చినా ఇవ్వకపోయినా ఒకటే అన్నాడు.

ఆ మాటలకు శంఖచూడుడు మదిలో సంశయించి బ్రాహ్మణులను చూసినంతనే వినయంతో నెప్పుడు గౌరవించే వాణ్ణి. ఇలాంటి వృద్ధునకు ఇవ్వటంకంటే వేరొకటి గలదా? ఇక పదిమాటలెందుకు? నా శరీరాన్నే ఇతనికి అర్పిస్తానని ప్రాణంతో సమానమయిన కవచాన్ని తీసి సంతోషంతో బ్రాహ్మణునకిచ్చాడు. దేవతలు పూలవర్షం కురిపించారు. దానిని తీసికొని అతడు సంతోషంతో శంఖచూడుని పోలికతో అతని భార్యదగ్గరికి వెళ్ళి ఆమె ప్రాతివ్రత్యాన్ని చెడుపదలచాడు. చక్రధరుడైన విష్ణువునకు సాధ్యంగానిది లేదు గదా!

యుద్ధంలో శివుడు శంఖచూడుని చంపటానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. బ్రహ్మాండమైన తన శూలాన్ని ప్రయోగించాడు. అప్పుడు శంఖచూడుడు శస్త్రాలు వదలి యోగాసనంలో విష్ణువును భజించగా అది రథానికి మాత్రమే తగిలింది. అలా విష్ణుమహిమ చేత, తన భార్య పాతివ్రత్య మహిమచేత అతను చావకున్నాడు.



## శంఖచూడుని వేషంలో విష్ణువు:

విష్ణుమూర్తి దేవతలను రక్షించటానికి రాక్షసాకారం ధరించి శంఖచూడుడిచ్చిన కవచాన్ని కప్పుకొని జయాన్ని చాటిస్తూ ఇంటిముందే నిలిచి ఉన్నాడు. ఆ సమయంలో తులసి తన భర్త రాకకొరకు ఇంట్లో ఎదురు చూస్తోంది. విష్ణువు తులసి పాతివ్రత్యాన్ని చెఱపదలచి, రాక్షసనాథుడైన శంఖచూడుని చంపదలచి దుందుభిని మ్రోగించాడు. అప్పుడు తులసి మనసులో సంతోషించి తన భవనపు కిటికీ నుంచి తొంగిచూసింది. చూసినవెంటనే తన భర్త వచ్చాడని సంతోషించి బీదవారికి, బ్రాహ్మణులకు, భిక్షాటకులకు ధనవస్త్రాలనిచ్చి వినయంతో ఉంది. శంఖచూడుని వేషంలో వున్న విష్ణువు రథం దిగి తులసి భవనాన్ని చేరుకొన్నాడు. తన భర్తయే అనుకొని నమస్కరించి పాదాలు కడిగి జలాన్ని చల్లుకొని, పాదాల తడిని వస్త్రంతో తుడిచి తొందరపాటుతో వుంది. తులసి భర్తను ఉన్నతాసనంలో వుంచి తాంబూలాన్నిచ్చి



"ప్రాణేశ్వరా! నేను చాలా కృతార్థనయ్యాను. నా జన్మ సార్థకమయ్యింది. యుద్ధం చేయటానికి వెళ్ళి తిరిగి వచ్చినందుకు చాలా సంతోషం." అని తులసి సంతోషంతో దేవతలతో జరిగిన యుద్ధ విశేషాలను వివరించాల్సిందిగా కోరింది.

అప్పుడు శంఖచూడుని వేషంలో ఉన్న విష్ణువు ఆమెతో "అనేక సేనలు గల ఇంద్రుడు ఒక పక్షం. అందరు ఒక ఎత్తు. నిటలాక్షుడయిన శివుడు ఒక ఎత్తు" అన్నాడు. అప్పుడు తులసి వాళ్ళతో యుద్ధం ఎలా చేశావో చెప్పుమన్నది. "నేను దేవతలతో యుద్ధం చేయాలని కోపంతో వాళ్ళను కలవరపెట్టించాను. చివరకు బ్రహ్మ ఆజ్ఞమేరకు దేవతల రాజ్యం ఇచ్చివేశాను. శివుడు యథేచ్ఛగా కైలాసానికి వెళ్ళాడు. దేవతలు సంతోషించారని" చెప్పి శయ్యపై పడుకున్నాడు. ఆ సమయంలో తులసి అతనితో కలసి సుఖించింది. ఆ సుఖం



పూర్వ సుఖంకంటే భిన్నంగా ఉండటాన్ని తెలుసుకొని కోపంతో ఇలా అంది– "మోసం జరిగినట్లుగా తోస్తోంది. ఈ సమయంలో నా పతివ్రతానియమాన్ని చెడిపిన నీవెవరో చెప్పు". అని అతి కఠినంగా పలికింది. శాపభయంచేత నిజస్వరూపం ధరించి విష్ణువు తులసి ముందు నిల్చాడు. అలాంటి మనోహరుడైన విష్ణుమూర్తిని చూసి ఆశ్చర్యంతో మూర్ఛపోయింది.

## నీవు రాయివి కా!

మళ్ళీలేచి విష్ణువును చూసి కోపంతో "ఓ మహానుభావా! దయాగుణం కొంచెం కూడ లేక ఈ విధంగా చేయటం మంచిదా? నా భర్త నీకు కొంచెం గూడ అపరాధం చేయలేదుకదా! నా భర్తను ఇతరులకొరకు మోసంచేత యుద్ధంలో చంపావు. నీ హృదయంలో మేలు చేయాలని





వుండదా! దోషం తెలియని నా భర్తను రోషంతో చంపావు. పాషాణత్వం పొందు"మని శపించింది.

## నీవు తులసి మొక్కగా రూపొందుతావు:

ఇలా శపించి ఏడుస్తున్న తులసిని చూసి కరుణా హృదయుడైన హరి "పూర్వం శంఖచూడుడు తపస్సుచేసి నిన్ను కోరాడు. నీవుకూడా నన్ను గూర్చి తపస్సు చేశావు. అందువల్ల దానవుడయిన శంఖచూడుడు నిన్ను కలసి సంతోషించి చనిపోయాడు. నీవు సంతోషంతో ఈ దేహం విడిచి చింతలేక నిశ్చలసుఖాన్ని పొందు. నీ తపస్సుకు ఫలంగా ఈ శరీరాన్ని విడిచినంతనే పవిత్రశరీరంతో నా దేవివి కాగలవు. చిరకాలం నాతో సుస్థిర భోగాలు అనుభవించ గలవు. నీ కళేబరం 'గండకి' అనే పుణ్యనదిగా ప్రవహిస్తుంది. నీ వెంట్రుకల సమూహం భూమిమీద తులసిగా వెలసి మూడు లోకాలను పవిత్రులుగా చేసే పత్రలతాంతాలుగా అవుతాయి.



ఆ పత్రాల పూలతో దేవతారాధన చేస్తే అన్ని కోరికలు సిద్ధిస్తా"యన్నాడు.

## నీవు నదివైతే నేను పర్వతాన్నవుతా:

ఇంకా విష్ణుమూర్తి ఇలా చెప్పాడు."తులసి మొక్క మూలంలో సమస్తదేవ తీర్థాలు వున్నట్లే. నరుడు తులసీదళాన్ని తాకిన వెంటనే వాని పాపాలన్నీ నశిస్తాయి. తులసీదళంతో కూడిన నీటిని సేవించినవానికి కోటి తీర్థాలలో స్నానం చేసిన పుణ్యం కలుగుతుంది. ఆ జలంతో ఇష్టదేవతాభిషేకం చేస్తే ఎక్కువ ఫలితముంటుంది. కార్తీక మాసంలో తులసీదళాన్ని పాత్రుడైన వానికిస్తే గోసహస్ర దానఫలం లభిస్తుంది. మరణకాలంలో తులసీపత్ర తీర్థం సేవించిన నరునికి సమస్తపాపాలు తొలగిపోయి విష్ణులోకానికి వెడతాడు. ప్రతిరోజు తులసితీర్థం సేవించే వారు లక్ష అశ్వమేధ ఫలాలను అనుభవిస్తారు. తులసీ దళధారులు, తులసీ కాండంతో



తయారు చేసిన మాలలను ధరించేవారు వైకుంఠవాసులతో సమానులై భోగాలను అనుభవిస్తారు. తులసీదళాన్ని త్రొక్కినవాడు కాలసూత్రమనే నరకంలో పడి ఆచంద్రార్కం బాధలను అనుభవిస్తాడు. పూర్ణిమ, ద్వాదశ సంక్రమణములలో తైలాభ్యంగనం చేసి త్రిసంధ్యలలో తులసీ పూజాపరతంత్రు డైనవాడు హరిసమీపవర్తియై ఉంటాడు. నీవు నదీరూపంలో సముద్రానికి భార్యవై ఉండే సమయంలో నేను భరతవర్షంలో కొండరూపంలో వుంటా"నని చెప్పి అంతర్థాన మయ్యాడు.

## తులసీ బృందావనం:

విష్ణుమూర్తి అనుగ్రహంతో బృందావనంగా మారిన తులసిని తర్వాతి యుగాలలో ఎందరో స్త్రీలు అనేక విధాల పూజించి తమ ఆశయాలను సాధించుకొన్నారు. పార్వతీ పరమేశ్వరులు ఎక్కడ వుంటారో అక్కడ విష్ణుమూర్తి





నివసిస్తాడు. తులసీ వ్రతానికి వైశాఖ, కార్తీక, మాఘ, ఫాల్గుణ మాసాలు అత్యుత్తమాలు.

## తులసీదళ విశిష్టత:

కృష్ణుడు ద్వాపరయుగంలో తులసిమాలను ధరించి వనమాలిగా పేరుపొందాడు. నారదుడు సత్యా, రుక్మిణుల పతిభక్తిని నిరూపించదలచి కృష్ణుని దానంగా పొందాడు. పిమ్మట నారదుడు కృష్ణుని అమ్మటానికి వస్తాడు. సత్యభామ కృష్ణుని పొందటానికి తన ఆభరణాలన్నీ త్రాసుకు ఒక భాగంలో వేసింది. కాని ఏం లాభం? త్రాసులో ఒకవైపున కృష్ణుడే హెచ్చవుతున్నాడు. రుక్మిణి సత్యభామలా త్రాసులో ఆభరణాలు వేయలేదు. తులసీమాతకు చేతులు జోడించి నారదుని దాస్యం బాపి కరుణించమని తులసీదళాన్ని తీసికొని త్రాసులో వేసింది. వెంటనే కృష్ణుడు వున్న త్రాసుభాగం, దళం వేసిన భాగం సమానమయ్యింది. రుక్మిణి అప్పుడు అమితానందాన్ని



పొందింది. అప్పుడు కృష్ణుడు తులసికి ఇలా వరాన్నిచ్చాడు– "నిన్ను పూజించు మానవులు నిత్యసుఖాన్ని పొంది గొప్ప మోక్షసామ్రాజ్యం పొందుతారు." తులసిదళంతో కూడిన నీటితో స్నానం చేస్తే విష్ణుమందిరంలో నున్నట్లే. తులసి చెట్టుకు బృందావనాన్ని నిర్మిస్తే పాపాలనుంచి విముక్తులవుతారు.

## తులసివనం పుణ్యతీర్థం:

తులసివనం ఎవరి ఇంట్లో ఉంటుందో ఆ ఇల్లు తీర్థంతో సమానం. తులసికాష్ఠంతో కూడిన శ్రీ గ్రంథాన్ని ఎవరు తమ శరీరానికి పూసుకొంటారో వారిని పాపములు ముట్టవు. తులసీమాహాత్మ్యాన్ని ఎవరు భక్తితో వింటారో వారు అన్ని పాపాలనుంచి విముకులై బ్రహ్మలోకానికి వెడతారు. ప్రతిదినం తులసివనాన్ని ఎవరు చూస్తారో వారిని పాపాలు ఆశ్రయించవు.



## తులసి పూజ:

**భక్తితో నిను గొల్చి దాస్యమును బాపి**
**వనిత రుక్మిణి మున్ను వాసిగాంచె**
**నీ దళంబున రామపాదముల్ పూజించి**
**త్యాగరాజులు మోక్షధాములైరి.**

తులసికి నీరు పోసేటప్పుడు, ఆ స్థలాన్ని అలికి, ముగ్గులు పెట్టేటప్పుడు, దీపాన్ని వెలిగించేటప్పుడు, పూజ చేసేటప్పుడు గోవిందనామాలు పాడుతుండాలి.

**"భక్తితో తులసికి గోవింద రామపాదులయినా జేతు**
**కృష్ణ తులశమ్మకు మ్రొక్కులయినా జేతు"**

అంటూ స్త్రీలు ఇప్పటికీ ఇలా పాడుకొంటూ పూజిస్తుంటారు.

**"బృందావనమున వెలసిన తల్లీ శ్రీలక్ష్మీ! శ్రీతులసీ!**
**మందారములతో పూజింతునమ్మా!**
**వందనంబిదే దేవీ! వందనంబిదే!**
**పసుపు కుంకుమల నొసగే తల్లీ!**
**మమ్ము వేగ బ్రోవవే, మమ్ము వేగ బ్రోవవే!**
**ఆశలు తీర్చె వరముల నొసగే**
**అమృతవాహినీ! దేవీ! శ్రీమహలక్ష్మీ!**
**జయ మంగళ మిదే జయ హారతిదే ఓ దయామయీ !"**

ఈ ప్రకారం ఆరు సంవత్సరాలు తులసిని విష్ణువును పూజ చేస్తే ఈ జన్మలో సకలసౌఖ్యాలను అనుభవించి జన్మాంతరంలో విష్ణుమూర్తియొక్క సాయుజ్యాన్ని పొందుతారు.



## తులసీస్తోత్రం

**పాపాని యాని రవిసూను పురార్పకాని।**
**గో బ్రహ్మ బాల పితృ మాతృ వధాధికాని ॥**
**నశ్యంతి తాని తులసీవన దర్శనేన ।**
**గోకోటి దాన సదృశం ఫల మాశు చ స్యాత్ ॥**

**యా దృష్టా నిఖిలాఘ సంఘ శమనీ స్పృష్టా పునః పావనీ**
**శుద్ధానా మభినందితా నిజరసై స్సిక్తాఽంతక త్రాసినీ**
**ప్రత్యాసక్తి విధాయినీ భగవతః కృష్ణస్య సంరోపితా**
**న్యస్తా తచ్చరణే విముక్తి ఫలదా తస్యై తులస్యై నమః ॥**

**లలాటే యస్య దృశ్యతే తులసీ మూలమృత్తికా ।**
**యమస్తం నేక్షితుం శక్తః కిము దూతా భయంకరాః ?॥**



**తులసీ కాననం యత్ర యత్ర పద్మవనాని చ।**
**సాలగ్రామశిలా యత్ర తత్ర సన్నిహితో హరిః ॥**

**పుష్కరాద్యాని తీర్థాని గంగాద్యా స్సరిత స్తతః।**
**వాసుదేవాదయో దేవాః వసంతి తులసీవనే ॥**

**తులసి! శ్రీసఖి! శుభే! పాపహారిణి! పుణ్యదే ।**
**నమస్తే నారదనుతే! నారాయణ మనఃప్రియే!**

**ఓం శాంతిః శాంతిః శాంతిః.**